

(గమనిక: అలనాటి మిస్సమ్మ చిత్రంలోంచి కొన్నిపాత్రలు దారితప్పి దీనిలో ప్రవేశించాయి)

# ఉత్తమ ఉపాధ్యాయ డిటెక్టివ్ రాజు

ప్రఫుల్లచంద్ర

అప్పాపురం ... మహాలక్ష్మీ ఉన్నత పాఠశాల... పదోక్లాసు...

కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకొని రాజు కుడి తర్జనితో నుదుట కొట్టుకుంటున్నాడు. అంటే దీర్ఘాలోచనలో వున్నాడన్నమాట. అతని దీర్ఘాలోచన పాఠం గురించి కాదు. రాత్రికి రాత్రి మాయమైన వీరయ్య గేదె గురించి!

రాజు అలాంటిలాంటి వాడు కాదు. కాస్తంత పరిశోధన మరికాస్త సామాజిక స్పృహ వున్నవాడు. పాఠం కంటే గేదె ముఖ్యమని తలచాడు. వెంటనే పక్కగదిలోని తొమ్మిదో క్లాసు మాష్టారు గోవిందుకు ఫోన్ చేశాడు.

గోవిందు అపర మేధావి. అయితే అతనిది పూర్తిగా గుండులాంటి బట్టతల కావడంతో తెలివితేటలు ఎండకు ఆవిరై గాలిలో కలిసిపోగా మిగిలిన కాస్త తెలివితేటలు ఆవిరై పోకుండా ఎల్లప్పుడూ నెత్తిన టోపీ పెట్టుకుంటాడు. నోరు తెరిచి మాట్లాడితే తెలివి ఖర్చయిపోవచ్చు. అందుకని ఉద్యోగంలో చేరుతూనే మౌనవ్రతం మొదలుపెట్టాడు. సైగలతోనే పాఠం. సైగలతోనే సంభాషణ. అర్థం కాకపోతే కాగితం మీద రాసి చూపుతాడు. జేబులో నోట్‌బుక్, పెన్ సదా సిద్ధంగా వుంచుకుంటాడు.

క్లాసులో ఎవరినో ఒకరిని అచ్చుపుస్తకం తీసుకొని నిలబడమని సైగ చేస్తాడు. తర్వాత బోర్డు మీద పేజీ నంబరు, పేరాగ్రాఫు నంబరు రాస్తాడు. ఆ కుర్రాడు సదరు పేరా నుంచి బిగ్గరగా చదవడం మొదలు పెడతాడు. చివరకు ''అదన్నమాట సంగతి'' అన్నట్లు భుజాలు ఎగరేస్తాడు గోవిందు. దాంతో పాఠం ఖతం! టీచింగ్ మేడ్ ఈజీ!

రాజు పక్కగది నుంచి ఫోన్ చేయగా గోవిందు విన్నాడు. అది అగ్గిపెట్టె ఫోన్. అంటే ఒక పొడవాటి వైర్‌కి అటూ యిటూ అగ్గిపెట్టె డొల్లని నోటివద్ద పెట్టుకుని మాట్లాడితే అవతల ఇంకొకడు అగ్గిపెట్టె డొల్లని చెవికి ఆనించి వింటాడన్న మాట. అయితే

ఈ ఫోన్‌కి డయలింగ్ సౌకర్యం లేకపోవడంతో ఒక కుర్రాడు గోవిందు వద్దకెళ్లి ఫోన్ చెవి వద్ద పెట్టుకోమని చెప్పి వచ్చాక రాజు మాట్లాడతాడన్నమాట.

"వీరయ్య గేదె ఎక్కడికి పోయిందంటావ్?" ఫోన్‌లో రాజు ఎన్నిసార్లు అరిచినా సమాధానం రాకపోవడంతో కోపంగా పక్కగదిలోకి వెళ్లాడు. గోవిందు గుమ్మం వైపే మిడుతూ మిడుతూ చూస్తూ రాజు రాగానే అప్పటికే పలకమీద రాసి వుంచిన సమాధానం చూపించాడు. "గేదె ఎక్కడికి పోయిందో వీరయ్యనే అడిగితే సరి!

"ఔను కదా! ఈ ఐడియా నాకెందుకు రాలేదు?" అని ఆశ్చర్యపోయి టోపీ తీసి గోవిందు గుండు మీద మొట్టికాయ వేశాడు రాజు. అది ఠంగున మోగింది. ఆ మోతకు హడలిపోయి అయోమయంగా అటూ ఇటూ చూసి మళ్లీ టోపీ తగిలించుకున్నాడు గోవిందు. టెలిఫోన్ అతనికి చ్చేసి అటునుంచి అలాగే వీరయ్య ఇంటికి బయలుదేరాడు రాజు.

అప్పాపురం పంచాయితీ సర్పంచ్‌ని అందరూ జమీందారు గారూ అని పిలుస్తారు. కాకినాడ చొల్లంగి తీర్థంలో ఎప్పుడో చిన్నప్పుడు తప్పిపోయిన వాళ్లమ్మాయి మహాలక్ష్మి పేరిట ప్రాథమిక పాఠశాల ప్రారంభించాడాయన. తప్పిపోయిన అమ్మాయి కుడిపాదం మీద కుంకుడు కాయంత పుట్టుమచ్చవుండేది. ఆ మచ్చే తమ కూతుర్ని తమ వద్దకు చేర్చుతుందని జమీందారు గారి విశ్వాసం.

అమ్మాయి దొరకలేదుగానీ ప్రాథమిక పాఠశాల హై స్కూలుగా ఎదిగింది. పట్నంలో రికమీగా తిరుగుతున్న మేనల్లుడు రాజుని దారిలో పెట్టడానికి జమీందారు గారు అతడిని తమ స్కూలులో మాస్టారుగా నియమిస్తే, తన ఫ్రెండ్ గోవింద్‌కి కూడా ఉద్యోగం ఇవ్వాలని కండిషన్ పెట్టాడు రాజు.

రాజుకి చిన్నప్పటినుంచి డిటెక్టివ్ అవాలని పెద్ద కోరిక. అప్పాపురంలో మాస్టారు అయాక ఆ కోరిక మరింత విజృంభించి ప్రస్తుతానికి తప్పిపోయిన గొర్రెలు, బర్రెలూ వెదికి పట్టుకోవడం పనిగాపెట్టుకున్నాడు. ఏ నాటికైనా అప్పాపురంలో ఒక హత్య జరగాలి. తను హంతకుడిని పట్టుకోవాలి- అన్నది అతని ఆశయం.

జమీందారుకు కావలసిన వాళ్లు కాబట్టి స్కూలులో రాజు, గోవిందు ఆడింది ఆట, చెప్పింది పాఠం! వాళ్లు ఎప్పుడు వచ్చినా, ఎప్పుడు వెళ్లిపోయినా గుడ్లప్పగించి చూస్తూ ఊరుకోవడం తప్ప హెడ్మాష్టరు చేయగలిగిందేమీ లేదు!

స్కూలు నుంచి తిన్నగా వెళ్లి వీరయ్యని కలిసి గేదె ఎక్కడికి పోయిందంటావ్ అని అడిగాడు రాజు. "అది తెలిస్తే నేనే తెచ్చుకునే వాడిని కదా, నువ్వెందుకూ?' నోట్లోంచి చుట్టతీసి తుపుక్కున ఉమ్మేసాడు వీరయ్య.

" ఔనుకదా! ఈ ఐడియా నాకెందుకు రాలేదు?" అని రాజు అయోమయంగా చూడగా "ఇదిగో డిటెక్టీవాడా! నీకో క్లూ సెబుతా, కోనసీమ ప్రజల చిరకాల కలని నిజం చేస్తూ కాకినాడ, కోటిపల్లి మధ్య రైలు లైన్ ఏయించిన మా యోగిగారు మాకు ఆరాధ్య దైవం. మా కుటుంబాలే కాక, మా గొడ్డూ గోదా, గొర్రె, బర్రె అన్నీ ఆయన అభిమానులే. ఆ అభిమానంతోనే మా గేదె కొత్తరైలు లైన్ ఎంబడి మేతకు పోయుంటాది. ఆ లైన్ ఎంబడి వెదుకు" దయదలచి సలహా ఇచ్చాడు వీరయ్య.

***

కాకినాడ, కోటిపల్లి ట్రెయిన్ అంతా కలిపి మూడు బోగీలే. ఆ ట్రెయిన్‌లో అడుగు పెట్టిన రాజు గుండె తరుక్కుపోయింది. సీట్లమీద దుమ్ము పేరుకుపోయి వుంది. ఫ్యాన్‌ల నిండా దుమ్మే. ఫ్యాన్ తిరుగుతోంటే దుమ్ము కిందకు రాలుతోంది. ఇక్కడ ఒకరు, అక్కడ ఇద్దరు చొప్పున మొత్తం ట్రెయిన్ అంతా కలిపి పదిమంది ప్రయాణీకులు! అందులో టికెట్ కొన్నది ఇద్దరే!

కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ స్టేషన్‌లయితే వున్నాయిగాని సిబ్బందేలేరు. టిక్కెట్ అమ్మే వాళ్లు లేరు. బండి దిగిన వాళ్లనుంచి టికెట్ తీసుకునే


బట్టతలతో మీరు ఇబ్బంది పడుతున్నారా?
Sonu's Clinic కు వెళితే చాలు

Over 29,700 Satisfied Patients

శస్త్ర చికిత్స, లేజర్ ట్రీట్‌మెంట్, హెయిర్ బాండింగ్ అవసరంలేదు
పై పూతతో నేచురల్ మెడిసిన్ తీసుకుంటే చాలు


After 60 days

అద్భుత చికిత్స కాలంలో రోగికి క్లినికల్ ఫలితాలు
100%
Safe with no side-effects
Treatment for Men & Women Too


After 90 days

నిజమైన, సహజసిద్ధమైన, ఆరోగ్యవంతమైన హెయిర్ ఫాసెల్స్ తిరిగి పెరుగుదలతో అద్భుత ఫలితాలు

MEDICINE COST RS. 150/- Onwards per week

Treatment for: • Dandruff - 1 week • Hair Fall - 15 days • Regrowth - min 2-3 months

SONU'S CLINIC
304, 305, 317, 3rd Floor, Satguru Complex,
Above Wood World Furniture,
Opp. Old Gandhi Medical College, Basheerbagh, Hyd.

for appointment & address clarification contact
between 8.30 am to 8.30 pm (open on Sunday)
Ph: 040- 55638871, 55638872, 55624128, 55828750

వాళ్లూ లేరు. బస్సులో కండక్టర్ లాగా టిక్కెట్లే అమ్మే వాడొకడుంటాడు గానీ కొనేవాళ్లే లేరు!

లైన్ పొడవునా వున్న స్టేషన్‌లు, అందులోని మరుగుదొడ్లు, సిమెంట్ బెంచీలు దుమ్ము కొట్టుకుపోయి కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ పరిస్థితి చూసి పరలోకంలో వున్న యోగిగారి ఆత్మ ఎంత క్షోభిస్తున్నదోనని రాజు మనసు కాసేపు క్షోభించింది.

అరట్లకట్ట స్టేషన్‌లో ట్రెయిన్ కుయ్యోమని కూసి రెండు చక్రాలు కదిలాయో లేదో పట్టాల పక్కన కనిపించిన గేదెను చూసి చటుక్కున బండినుంచి దూకేసి పట్టరాని ఆనందంతో దాని తోక పట్టుకుని చొచొచో దాదాదా అన్నాడు రాజు. గేదె కదలలేదు గాని అక్కడే ఆడుకుంటున్న కుర్రాళ్లు పరుగున వచ్చారు.

''ఈ గేదెను లాక్కెళ్లాలి. తాడుగాని పలుపుగాని పట్రండి'' కుర్రాళ్లని అడిగాడు రాజు. '' మా గేదెను లాక్కెళతావా? నువ్వెవడివెహే'' అరిచాడు పుచ్చుపళ్ల కుర్రాడు.

''తప్పు బాబూ! ఈ గేదె మీది కాదు, వీరయ్యది. నిన్న తప్పిపోయి యిలా వచ్చేసింది. దీన్ని ఆయనకు అప్పగించాలి'' శాంతంగా వివరించాడు రాజు.

''ఆ వీరయ్య ఎవడెహే! ఇది మా గేదె.'' చిరుత పులిలాగా గాండ్రించాడు పుచ్చుపళ్ల కుర్రాడు.

''చూడు బాబూ పొరబడుతున్నావు! చూడు దీనికి నాలుగు కాళ్లూ, ఇంగ్లీషు అక్షరం డబ్ల్యులాగా కొమ్ములు, అరటి దొప్పల్లాగా చెవులూ, మర్రి ఊడలాగా తోకావున్నాయి. పైగా తారులాగా నల్లగా వుంది. ఇది వీరయ్యదే'' సహనంతో విశదీకరించాడు రాజు.

ఈ లోగా అక్కడికొచ్చిన ఆ పిల్లాడి తండ్రి ''ఓయ్ పంతులూ! అన్నిగేదెలూ నల్లగానే వుంటాయి. దేనికైనా నాలుగే కాళ్లు; అరటి దొప్ప చెవులు, మర్రివూడ తోక వుంటాయి. ఇట్టాసూడు! నాది గుండు బుర్ర. చేతిలో కర్ర. కళ్లకు తీగబిళ్ల జోడు వున్నాయి. చొక్కాలేదు. ముడుకులు దాటని పంచె. అంతమాత్రాన నేను మహాత్మాగాంధీ అయిపోతానా?''రీజన్ పీకాడు.

అతని వైపు ఎగాదిగా చూసి ''ఏమో, నువ్వు మహాత్మాగాంధీవేనేమో'' అనుమానంగా అన్నాడు రాజు. అతడు భళభళా నవ్వేసి ''ఓరి నీ అసాధ్యం కూలా! మహాత్మాగాంధీని చంపేశారు గదయ్యా!'' అడిగాడు.

''ఔను కదా! నాకెందుకు తట్టలేదు! అనిపించినా ''మహాత్ముడు మళ్లీ నీ రూపంలో పునర్జన్మ ఎత్తాడేమో'' అన్నాడు బింకంగానూ, అనుమానంగానూ.

వీడెవడో చిరతపూడి పిచ్చాసుపత్రి నుంచి గొలుసులు తెంచుకొని వచ్చేసిన బాపతులాగా కనిపించాడతనికి. ''ఇలాసూడు! గేదె ముడ్డిమీద 'స' అనే అక్షరం కాల్చిన మచ్చ వుంది. స అంటే సత్తెయ్య. అంటే నేనే! ఈ గేదె నాది! కాదన్నావో, నేనా గాంధీలాగా సత్యాగ్రహం చేయనురా, నీ బుర్ర రాంకీర్తన పాడించి నా గేదెను తోలుకపోతా'' గద్దించాడు సత్తెయ్య.

అహింస పరమ ధర్మమని చటుక్కున గ్రహించిన రాజు గేదెను వదిలేశాడు.

***

ఈసారి ట్రెయిన్‌లో కాక బస్సులో అప్పాపురం వెళ్లి భోజనం చేసి మూడుగంటలకు స్కూలుకెళ్లాడు రాజు. క్లాసులు ఎగ్గొట్టడం, అందుకు కారణాల కథలు చెప్పడం అతనికి అలవాటే. ఆట పట్టించడం పిల్లలకు అలవాటు.

పదోక్లాసు గదిలో అడుగుపెడుతూనే ''పిల్లలూ! నేనిప్పుడే మహాత్మాగాంధీని చూసి వస్తున్నానర్రా! '' అన్నాడు గొప్పగా.

''మీరు స్వర్గానికెళ్లారా సార్? గాంధీగారితో బాటు రంభను చూశారా? ఎలా ఉందిసార్, రంభ? '' అడిగాడొక గడుగ్గాయి.

''విమానంలో వెళ్లారా? ఛార్జి ఎంత సార్? మీరు అక్కడే వుండిపోవలసింది'' ఎగతాళిచేశారు కొందరు.

''గాంధీగారు స్వర్గంలో లేరురా. నాకు అరట్లకట్ట సమీపాన కనిపించి నేను పట్టుకున్న గేదెను లాక్కుపోయారు''

''పోదురూ బడాయి! ఆయన తాగేది మేకపాలు కదా. ఆయనకు గేదె ఎందుకు?''

రాజుకీ అదే అనుమానం. ఆలోచిస్తూ గంభీరంగా వుండిపోయాడు రాజు. అంతలో అక్కడికొచ్చిన గోవిందు పలక మీదరాసి చూపించాడు.

''వీరయ్య గేదె వచ్చేసింది''

చిక్కుముడి విడిపోయి రాజు ముఖం వికసించింది. అదన్నదీ సంగతి. గాంధీగారు గేదెను తోలుకుపోయింది తనకోసం కాదు! వీరయ్యకివ్వడానికి!

***

ఆగస్టు నెల నడుస్తోందంటే మాస్టార్ల ఆలోచనలు సాగుతూ వుంటాయి– ఈ ఏడు ప్రభుత్వం ఎవరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటిస్తుందోనని ఒకే ఊరికి చెందిన ఇద్దరికి ఒకేసారి అవార్డు రావడం అరుదు. ఒకే స్కూలులోని ఇద్దరికి రావడం అద్భుతమే. అలాంటి అద్భుతాన్ని సాధించింది అప్పాపురం మహాలక్ష్మి ఉన్నతపాఠశాల. రాజు, గోవిందులు ఉత్తమ ఉపాధ్యాయులు.


హైదరాబాద్‌లో అవార్డు తీసుకోవడానికి రెండు రోజుల ముందే యిద్దరికీ అప్పాపురంలో సన్మానం ఏర్పాటు చేశారు. అనర్హులకు సన్మానాన్ని భరించలేక సన్మానానికి వెళ్తే మనస్సాక్షికి విరుద్ధంగా వాళ్లని పొగడవలసి వస్తుందని సెలవు పెట్టి ఇంట్లో పడుకున్నాడు హెడ్మాష్టర్.

జమీందారు గారు, విద్యాధికారితోబాటు మరో నలుగురు గ్రామపెద్దలు వేదికను అలంకరించగా పదిమంది మాస్టార్లు ఏర్పాట్లు చేస్తూ హడావిడి పడుతున్నారు. సభకు వచ్చిన విద్యార్థుల సంఖ్య కంటే వేదిక నలంకరించిన పెద్దల సంఖ్యే ఎక్కువ! గ్రామ ప్రజల్ని సమావేశానికి రప్పించడానికి ఒక గంట రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రజలు డాన్స్ అయిపోగానే నమ్మకంగా వెళ్లిపోయారు! ఇంక మిగిలింది నలుగురు విద్యార్థులు, ఆరుమంది పెద్దలు పదిమంది ఉపాధ్యాయులు!

జనం పలుచగా వున్నా, కార్యక్రమం ప్రారంభించమని జమీందారు సూచించాడు.

వేదిక మీద మహారాజా చెయిర్స్‌లో రాజు, గోవిందులను కూర్చోబెట్టి చేతికి పుష్పగుచ్ఛాలిచ్చి శాలువలు కప్పి దండలు వేశాడు విద్యాధికారి.

మైక్ ముట్టగానే పూనకం వచ్చిన ఒక మాస్టారు ''తామస్ హల్వా ఎడిషన్ టెలిఫోన్ కనిపెట్టాడని పొగుడుతాం కానీ, మన మధ్యనే వున్న మేధావి, శాస్త్రజ్ఞుడు అయిన వ్యక్తిని గుర్తించలేకపోతున్నాం. మనరాజుగారు ఉత్తమ ఉపాధ్యాయుడే కాదు; శాస్త్ర



జ్ఞుడు కూడా, అగ్గిపెట్టె డొల్లలతో టెలిఫోన్ తయారు చేశారాయన'' అన్నాడో లేదో, ''టెలిఫోన్ కనిపెట్టినవాడు ఎడిసన్ కాడు, అలెగ్జాండర్ గ్రాహంబెల్'' అరిచాడో కుర్రాడు.

''గ్రాహం బెల్లో, బిల్లు క్లింటనో - ఎవడో ఒహడు. మనం మన వాళ్లని వదిలేసి ఎవరినో పొగడ్డం ఏమిటీ'' అంటూ ఘోషించి శోషించి కింద పడిపోయాడు. ఇంకో మాస్టారు రాజుగారి డిటెక్షన్ గురించి ఉద్బోధించి ఉద్బోధించి సొమ్మసిల్లి పడిపోయాడు.

మరో మాస్టారు గోవిందనామస్మరణ చేసుకొని ''ప్రపంచంలో ఎక్కడా ఏ స్కూల్‌లోనూ క్లాసులో మౌనవ్రతం ఆచరించే మాస్టారే లేడు. మన స్కూలులో వున్నాడు. అంతేకాదు, అతనికి ప్రభుత్వం అవార్డు కూడా ప్రకటించింది. ఇదొక ప్రపంచ రికార్డు. గిన్నిబుక్కులో ఎక్కవలసిన రికార్డు'' అని రొదపెట్టాడు.

''గిన్నిబుక్కు కాదు, గిన్నిస్ బుక్'' అరిచారు విద్యార్థులు. తర్వాత రాజు, గోవిందులాంటి వారిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడాన్ని, వారిని మాస్టార్లు ఘనంగా పొగడడాన్నీ నిరసిస్తూ పిల్లికూతలూ, నక్కకూతలూ కూశారు. చప్పట్లు కొట్టారు గోలచేశారు.

సభలో వున్న ఆ నలుగురు విద్యార్థుల్నీ అదుపులో పెట్టలేక తామూ అరుస్తూ మాస్టార్లు లాఠీ చార్జి చేయగా పిల్లలు పారిపోయారు. సభలో ప్రశాంతత నెలకొంది.

సభలో ఇంత రభస జరుగుతున్నా, పట్టించుకోకుండా - శాలువా కప్పుకున్న గిన్నికోడి యిల్లెక్కి కూర్చున్నట్టు నిశ్చింతగా కూర్చుని పుష్పగుచ్ఛాలు వాసన చూస్తూ మిడుతూ మిడుతూ చూస్తున్నారు రాజు, గోవిందు.

కన్నకూతురి జ్ఞాపకార్థం ఉన్నతాశయంతో ప్రారంభించిన స్కూలు దుస్థితి అర్థం అయి ఖిన్నుడయాడు జమీందారు. హెడ్మాస్టర్ ఎన్నోసార్లు మొత్తుకున్నాడు రాజు, గోవిందుల వల్ల స్కూల్ వాతావరణం చెడిపోతుందని అయినా, మేనల్లుడి డాంభికాలు నమ్మి తనేం పట్టించుకోలేదు. ఇప్పుడీ దుస్థితి చూశాక ఆయనలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఇలాంటివాళ్లకయ్యా నువ్వు అవార్డులిప్పించేది అని విద్యాధికారి మీద భగ్గుమన్నాడు.

''అయ్యా, తమరు నాకు ఉండమని ఇల్లిచ్చారు, తినమని గింజలిచ్చారు. ప్రతి ఏటా మామిడిపళ్లూ, జున్నూ పంపుతున్నారు. మీ జున్ను తిన్న విశ్వాసంతో ఆ ఇద్దరికీ అవార్డులిప్పించాను మీరు సంతోషిస్తారని...'' వానపాములాగ కుంచించుకుపోయిన విద్యాధికారి నసిగాడు.

''వీళ్లు ఉత్తి ఉపాధ్యాయులు కూడా కాదు, వీళ్ళని బట్టుకుని ఉత్తమ ఉపాధ్యాయులేమిటయ్యా! వీళ్లని చూసి అందరూ ఇలాగే తయారైతే స్కూలు మూసేయాలి, వద్దు, వీళ్లకి అవార్డు వద్దు. వీళ్లని ఇప్పుడే డిస్మిస్ చేస్తున్నా'' జమీందారు కోపం ఇంకా తగ్గలేదు.

''సరేనండయ్యా! డిస్మిస్ చేసెయ్యండి. నిజంగా నిఝం ఉత్తమ ఉపాధ్యాయుల్ని మీ స్కూలులో వేయిస్తా'' వాగ్దానం చేశాడు విద్యాధికారి.

''వాళ్లిద్దరూ మొగుడూ పెళ్లాం అయితే మరీ మంచిది. మా ఇంటిలోనే కూతురూ అల్లుడూ లాగా పడి వుండి స్కూలుని భద్రంగా కాపాడుకుంటారు''

బుర్ర ఊపాడు విద్యాధికారి.

సన్మానం రోజే ఉద్యోగం ఊడినందుకు గోవిందు గిన్నె కోడిలాగా రోదించినా రాజు మాత్రం సంతోషించాడు.

''థాంక్యూ మామయ్యా! ఇకపై యిబ్బడి ముబ్బడిగా నా యావత్తు శక్తియుక్తుల్ని అపరాధ పరిశోధనకు ధారపోస్తా'' పిడికిలి పైకెత్తి ఘోరశపథం చేశాడు రాజు.

(ఆ తర్వాత ఎంటీరావు, మిస్ మేరీ దంపతులమంటూ ఉద్యోగాలు సంపాదించడం, మేరీ కుడి పాదం మీద కుంకుడు కాయంత పుట్టుమచ్చ వున్నట్టు ఫుల్‌టైమ్ డిటెక్టివ్ రాజు కనిపెట్టడం, ఆ మిస్సమ్మే జమీందారు గారి తప్పిపోయిన కూతురు మహాలక్ష్మి అని వెల్లడి కావడం- జగమెరిగిన కథే)

